నేటి నుంచి శరన్నవరాత్రులు

పెద్దపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రులు ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో మండపాలను అలంకరించారు. సోమవారం ప్రారంభమయ్యే శర్నవరాత్రులు విజయదశ మితో ముగియనున్నాయి. హిందువులకు దసరా పండుగ ముఖ్యమైనది. తొమ్మిది రోజులపాటు దేవి శరన్నవరాత్రులుగా కొలుస్తారు. మొదటి మూడు రోజులు పార్వతీదేవికి, తర్వాత మూడురోజులు లక్ష్మీ దేవికి, ఆ తరువాత మూడు రోజులు సరస్వతికి పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మ వారిని తొమ్మిది రూపాల్లో అలంకరించుకొని పూజలు చేస్తారు.

లక్ష్మణ్ బాపూజీ అందరికీ ఆదర్శం



ఓదెలలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహిస్తున్న పద్మశాలీలు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మొదటి ఉద్యమంలో కీలక పాత్ర వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ అందరికీ ఆదర్శమని పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి మలిదశ ఉద్యమ నేత కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మాజీ మంత్రి లక్ష్మణ్ బాపూజీ చేనేత రంగానికి సేవలందించి, తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. అనంతరం కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, మేర్గు భీష్మచారి, క్యాతం వెంకటేశ్వర్లు, క్యాతం రాజేంద్రప్రసాద్, తాటికొండ రామచంద్రం, బూర రామచంద్రం, అరకాల సదానందం, క్యాతం సత్తయ్య, గుండేటి కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నటుడు శివారెడ్డి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబరు 2న నిర్వహించే దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు సినీ నటుడు శివారెడ్డి చెప్పారు. ఆదివారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏసీపీ రమేష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు, దీని కోసం ఏయే కార్యక్రమాలు నిర్వహించాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రామగుండంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, రావణ దహనం, మిరిమిట్లు గొలిపే లైటింగ్, క్రాకర్స్‌తోపాటు గాయని, గాయకులు, నటులు, డ్యాన్సర్లు, యాంకర్లతో ఉత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏర్పాట్ల పరిశీలనలో సీఐ ఇంద్రసేనారెడ్డి, డీజీఎం (సివిల్) వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, దీటి బాలరాజు, పొలసాని శ్రీనివాస్‌తో పాటు సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడి ఆందోళన



స్థలం ఎదుట పిల్లలతో కలిసి ఆందోళన చేస్తున్న రాజయ్య

గోదావరిఖని, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా అనాథ పిల్లల ఆశ్రమం నడుపుతున్న తమపై కక్షగట్టి స్థలం ఇచ్చేందుకు రూ.10లక్షలు ఇవ్వాలని జిల్లా సంక్షేమాధికారి ద్వారా కలెక్టర్ డిమాండ్ చేస్తున్నారని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ ఆశ్రమ నిర్వాహకుడు పోచంపల్లి రాజయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆశ్రమ పిల్లలతో కలిసి స్థలం ఎదుట ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి కలెక్టర్ దేవసేన బస్టాండ్‌కు వెళ్లే దారిలో సర్వే నెం. 706లో 10గుంటల భూమి అప్పగించాలంటూ సింగరేణికి లేఖ రాశారని పేర్కొన్నారు. ఆ స్థలంలో తాత్కాలిక షెడ్డు నిర్మించుకుంటే సింగరేణి యాజమాన్యం షెడ్డును కూల్చి వేసిందని, దీనిపై తాను కోర్టుకు వెళ్లానన్నారు. అనంతరం వచ్చిన కలెక్టర్ ముజ్‌మిల్‌ఖాన్ స్థలం ఇచ్చేందుకు అంగీకరించారని, కలెక్టర్ బదిలీ అయ్యారన్నారు. జూన్ నెలలో స్థలం ఇవ్వాలని హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందన్నారు. స్థలం కావాలంటే రూ.10లక్షలు ఇవ్వాలని ప్రస్తుత కలెక్టర్ డీడబ్ల్యూఓ ద్వారా డిమాండ్ చేశారని, లేదంటే కోర్టుకు వెళ్లాలని ఆరోపించారు. తమ ఆశ్రమానికి స్థలం ఇవ్వాలంటూ పోలీస్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసుల జోక్యంతో ఆందోళన విరమించారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..

- వైభవంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు
- ఆటాపాటలతో హోరెత్తిన ఊరు.. వాడలు..
- ఆడబిడ్డల సందడి



పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి మహిళలు, యువతులు పెద్ద ఎత్తున ఆయా పట్టణ కేంద్రాలలో నెలకొల్పిన పూలు, చామంతులు, తదితర బతుకమ్మకు సంబంధించిన అలంకరణ వస్తువులను కొనుగోలు చేశారు. ఉపవాసంతో మహిళలు బతుకమ్మలను పేర్చి, పూజా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వేళ ఆడపడుచులు బతుకమ్మలను కూడళ్లలో ప్రతిష్ఠించి, తీరొక్క పాటలతో బతుకమ్మ ఆడారు. కోలాటాలు, డీజే చప్పుళ్లతో వాడలన్ని మారుమోగాయి. మన సంస్కృతిని కాపాడటంతోపాటు ముందు తరాలకు అందించే చక్కని వేదిక బతుకమ్మ అంటూ పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. అమర్‌నగర్‌లో ముదిరాజు ఆడబిడ్డలు పెద్ద ఎత్తున గునుగు, తంగేడు పూలతో బతుకమ్మలను పేర్చి పలువురిని ఆకర్షించారు. అలాగే తెనుగువాడ, ఆర్యవైశ్యభవన్, వెంకటేశ్వరస్వామి దేవాలయం, బాలాజీనగర్, హనుమాన్ నగర్, కొంతంవాడ, శాంతినగర్ తదితర వాడలతోపాటు మున్సిపల్ అధికారులు కూడళ్ళ వద్ద విద్యుత్ అలంకరణలు చేశారు. అలాగే పెద్దపల్లి ట్యాంక్ బండ్‌గా పిలిచే ఎల్లమ్మ గుండం కట్ట వద్ద రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిదులు, పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మొదటి రోజున నిర్వహించుకున్న బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా నిమజ్జనం చేసి, ఆడపడుచులు ఇళ్లకు చేరుకున్నారు.

మంథని: తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండుగ వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఎంగిలిపూల బతుకమ్మలు పేర్చి ఆడిపాడి సందడి చేశారు. ఉదయం నుంచి తంగేడు, రాచగుమ్మడి, గోరింట, కట్ల, సీత జెడలు, గులాబీలు, మందారాలు వంటి రకరకాల పూలను సేకరించిన మహిళలు, పిల్లలు మధ్యాహ్నం బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళ వద్ద బతుకమ్మలను పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. మంథని మాజీ చైర్‌పర్సన్స్ పుట్ట శైలజ, పెండ్రి రమలు, వివిధ రాజకీయ పార్టీల మహిళా నేతలు పలు చోట్ల మహిళలతో బతుకమ్మ ఆటలు ఆడి సందడి చేశారు. మహిళల బతుకమ్మ ఆటాపాటలతో సాయంత్రం నుంచి రాత్రి వరకు గ్రామ కూడళ్లల్లో సందడి నెలకొంది. బతుకమ్మ ఆటల వద్ద డీజే సౌండ్స్‌తో బతుకమ్మ, దాండియా పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేసి హోరెత్తించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. గౌరమ్మ వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. తొమ్మిది రోజులపాటు ఎండగతో పల్లె, పట్నం తేడా లేకుండా సందడి మొదలైంది.

సుల్తానాబాద్: ఎంగిలి పూల బతుకమ్మను అంగరంగ వైభవంగా మహిళలు ప్రారంభించుకున్నారు. శనివారం వరకు బొడ్డెమ్మ ఆటలు కొనసాగగా, ఆదివారం ఉదయం సుల్తానాబాద్ మార్కెట్‌లో బతుకమ్మకు సంబంధించిన పలు రకాల పువ్వులు, ఆకులు, ఇతర వస్తువుల విక్రయాలతో సందడిగా మారింది. మహిళలు ఉపవాసం ఉండి బతుకమ్మ లను అందంగా పేర్చారు. అనంతరం సాయంత్రం ప్రధాన కూడళ్లు, వీధుల్లో బతుకమ్మలను ఒకచోట పెట్టి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆయా చెరువు ల్లో నిమజ్జనం చేశారు. వారు వెంట తెచ్చుకున్న పిండి పదార్థాలను ఒకరికొకరు వాయినంగా ఇచ్చి పుచ్చుకుని ఇళ్లకు చేరారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలో బతుకమ్మ సంబరాలు మహిళలు నిర్వహించుకున్నారు. ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మను వివిధ రకాలుగా సేకరించిన పూలతో అందంగా పేర్చి, ముస్తాబు చేశారు. సాయంత్రం కూడళ్ళు, ఆయా మండపాల వద్ద ముగ్గులతో ముస్తాబు చేసి, బతుకమ్మలను ప్రతిష్ఠించి బతుకమ్మ ఆడారు. కార్యదర్శులు బతుకమ్మ ఆట స్థలాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

(మరిన్ని 6వ పేజీలో)







గోదావరిఖనిలో బతుకమ్మతో చిన్నారి, బతుకమ్మ ఆడుతున్న మహిళలు





పెద్దపల్లి శివాలయంలో బతుకమ్మతో సెల్ఫీ, బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జిల్లా మహాసభను జయపద్రం చేయండి

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా 4వ మహాసభలు ధర్మారంమండల కేంద్రంలో ఈనెల 24న ఆకుల రాజయ్య ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామపంచాయతీ సమస్యలు అధిగమించడానికి కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ మహాస భలకు జిల్లాలో అన్నిగ్రామాల్లో పని చేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు, మండల కమిటీల నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ సీపెల్లి రవీందర్, జిల్లా ప్రధాన కార్య దర్శి ఖాజా, జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య, అశోక్, జిల్లా కమిటీ సభ్యులు రామచందర్, శారద, ముస్తాఫా, వేల్పుల భాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు.

జోరుగా కల్తీ మద్యం..



మద్యాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్(ఫైల్)

- లైసెన్స్ గడువు దగ్గర పడుతున్నా కొద్ది పెరుగుతున్న కల్తీ
- దసరా పండుగ దగ్గర పడుతుండడంతో బెల్ట్ షాపులకు తరలుతున్న మద్యం...
- మంత్రి ఆదేశించినా తనిఖీలపై దృష్టి పెట్టని ఎక్సైజ్‌శాఖ
- మద్యం ప్రియుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం

జిల్లాలో కల్తీ మద్యం అమ్మకాలు పెరిగాయి... ఎక్సైజ్ శాఖ నిఘా లేక పోవడంతో అమ్మకాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో కల్తీ మద్యం విక్రయాలు కూడా అదే స్థాయిలో పెరు గుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట జరిగే విక్రయాల్లో కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కోల్‌సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో 77వరకు వైన్‌షాపులు, బార్లు ఉన్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 27 రిటైల్ షాపులు, పది బార్లు ఉన్నాయి. జిల్లాలో రెండు మద్యం షాపులు రోజుకు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అమ్మకాలు జరిపే కౌంటర్లు ఉన్నాయి. ఒక్కో మద్యం షాపునకు 60 నుంచి 70వరకు బెల్ట్‌షాపులు ఉన్న పరిస్థితి ఉంది. నవం బర్‌తో మద్యం లైసెన్స్ గడువు ముగుస్తుంది.

దీంతో ఈ రెండు నెలల్లో అమ్మకాలపై దృష్టి పెట్టిన కొందరు వ్యాపారులు కల్తీ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వ్యాపారులు బెల్ట్ షాపులకు హోల్‌సేల్ కౌంటర్, రిటైల్ కౌంటర్లు నిర్వహి స్తున్నారు. ఎక్కువగా మద్యం అమ్మకాలు జరిగే బ్రాండ్‌లను కల్తీ చేసి బెల్ట్‌షాపులకు పంపుతున్నారు.

రిటైల్ మద్యం దుకాణాల్లో సైతం ఏ రోజుకా రోజు కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. కొన్ని మద్యం షాపుల్లో సీసాల క్యాప్‌లు ఓపెన్ చేసి నీరు, తక్కువ ధర మద్యం నింపుతున్నారు. కొందరు షాపుల నిర్వాహకులైతే ఇతర ప్రాంతాల నుంచి ఖాళీ క్యాప్‌లు తెప్పించుకుని సీసాలకు బిగిస్తున్నట్టు తెలుస్తున్నది. రాత్రిపూట జరిగే మద్యం విక్రయాల్లో ఈ కల్తీ మద్యం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. మద్యంకు సంబంధించి చీప్ లిక్కర్, మీడియం రేంజ్, ప్రీమియం రేంజ్ క్యాటగిరి లుగా ఉంటాయి. ఎక్కువగా అమ్మకాలు జరిగే ప్రీమియం రేంజ్ విస్కిలలో చీప్ లిక్కర్ కలిపి అమ్మకాలు సాగిస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో పెద్దపల్లి పట్టణంతో పాటు సుల్తానాబాద్, గోదావరిఖని ప్రాంతాల్లో పోలీస్, టాస్క్‌ఫోర్స్, స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్‌లు దాడులు చేసి కల్తీ మద్యాన్ని పట్టుకొని షాపులను సీజ్ చేశాయి. ఈ ఏడాది జిల్లాలో మద్యం తనిఖీలు జరగడం లేదు.

మంత్రి ఆదేశించినా... కదలని ఎక్సైజ్‌శాఖ

కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై దృష్టి పెట్టాలని ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. దసరా దృష్టిలో ఉంచుకుని కల్తీ మద్యం విక్రయాలు లేకుండా తనిఖీలు జరపాలని పేర్కొన్నారు. కేవలం నామమాత్రంగా తనిఖీలు జరిపి ఫొటోలతో అధికారులు గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన తనిఖీలకు సంబంధించి ఒక రోజు ముందే షాపు యజమానులకు సమాచారం తెలిసిందంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా మద్యం తనిఖీలకు సంబంధించి థర్మోమీటర్, హైడ్రోమీటర్‌తో పరీక్షలు చేయాల్సి ఉంటుంది. మద్యంలో నీటితో కల్తీ చేస్తే టెంపరేచర్‌లో తేడా వస్తుంది. దీనిని థర్మోమీటర్‌తో గుర్తిస్తారు. మద్యం నాణ్యతకు సంబంధించి హైడ్రోమీటర్ పరీక్షల్లో తేలుతుంది. ఎక్సైజ్ అధికారులకు నెలవారి ఒప్పందాలతో ఈ కల్తీ దందా వ్యాపారం సాగుతుందనే విమర్శలున్నాయి.

ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం

కల్తీ మద్యం సేవించడం వల్ల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. కాలేయ, శ్వాస, జీర్ణకోశ సమస్యలు ఎక్కువగా గుర్తిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. రక్తపోటు, కంటి చూపు, నాడీవ్యవస్థపై ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు.



అధికారులు పట్టుకున్న కల్తీ మద్యం (ఫైల్)

ఆయిల్‌పామ్ సాగుపై అన్నదాతల ఆసక్తి



- జిల్లాలో 3200 ఎకరాలలో సాగు
- ఈ ఏడాది 2500 ఎకరాల లక్ష్యం
- 350 ఎకరాల్లో కొత్తగా సాగు
- టన్నుకు 18 వేల నుంచి 19 వేల వరకు ధర
- పంట దిగుబడులు విక్రయించిన రైతులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేసే రైతులు ఆయిల్‌పామ్‌ను ఎంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడి, దీర్ఘకాలికంగా ఆదాయాన్ని అందిస్తోంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగుపై సబ్సిడీలు ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. మూడేళ్ల క్రితం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు గురించి రైతాంగానికి అవగాహన కల్పించడంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నర్సరీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో నర్సరీ ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి ఇందుకు సంబంధించిన మొక్కలు తెప్పించి నలభై ఎనిమిది ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను పెంచుతున్నారు.

జిల్లాలోని 14 మండలాల రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. రైతులకు శాస్త్ర వేత్తలు, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో సలహాలు సూచనలు ఇప్పించారు. మొదట జిల్లాలో పదివేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. యేటా సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

జిల్లాలో ప్రయోగాత్మకంగా కొందరి భూముల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంట చేతికి వచ్చింది. ఇప్పటి వరకు రెండు కటింగ్‌లు చేపట్టిన రైతులకు ఉద్యాన శాఖాధికారులు సూచించిన మేరకు దిగుబడులు రావడంతో రైతులలో ఆనందం వెల్లివిరుస్తున్నది. 20 ఎకరాలలో సాగు చేయగా మంచి దిగుబడులు వచ్చాయి. ఆయిల్ పామ్ గెలలను విక్రయించగా ఒక్కో టన్ను కు 18 వేల నుంచి 19 వేల రూపాయల పై చిలుకు ధర పలకడం గమనార్హం. ఇటీవల సాగు చేసిన ఆయిల్ పామ్ పంటకు సంబంధించిన దిగుబడులు డిసెంబర్, ఫిబ్రవరి నెలలో ఆశించిన స్థాయిలో వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడేళ్లగా ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు రైతులను ప్రోత్సహిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా 3200 ఎకరాలలో సాగు చేస్తున్నారు.

రైతులకు సబ్సిడీలు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మూడేళ్ల క్రితం చేపట్టారు. సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో ఎస్సారెస్పీ కాలువ పక్కన దాదాపు 48 ఎకరాల విస్తీర్ణంలో తిరుమల ఆయిల్ కేమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచింది. రైతులు సాగు చేసిన పంట దిగుబడులను కూడా తిరుమల ఆయిల్ కేమ్ కంపెనీ కొను గోలు చేసింది. ఇటీవల కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి శివారులో ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఆయిల్‌పామ్ గెలలను శుద్ధి చేసి ఆయిల్‌గా మార్చి ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,200 ఎకరాల్లో రైతులు పంట వేశారు. ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపే ఎస్సీ రైతులకు వంద శాతం, బీసీలకు తొంభై శాతం చొప్పున సబ్సిడీలు ఇస్తున్నారు. అలాగే డ్రిప్‌కోసం అవసరమైన పెట్టుబడి మొత్తాన్ని అందించి నాలుగేళ్ల అనంతరం వాయిదాల రూపంలో కంపెనీ వారు వసూలు చేసుకుంటారు.

ఇవే కాకుండా సాగు చేస్తున్న ఎకరాకు 4200 రూపాయల చొప్పున పెట్టుబడులు కూడా ఇస్తున్నారు. ఇలా చెల్లింపులు నాలుగేళ్ల వరకు ఉం టాయి. ఎకరానికి చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రిభుజాకారంలో 57 మొక్కలు నాటుతారు. జిల్లాలో రైతులు ఆయిల్‌పామ్ సాగును లాభాదా యకమైన పంటగా భావిస్తున్నారు. టన్నుకు 18 నుంచి 20 వేలకు పైగా ధర పలుకుతుందంటున్నారు. ఇంకా బాగా చేస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతులు భావిస్తున్నారు. ఆయిల్ పామ్ పంట సాగును అంతర పంటలు కూడా వేసుకోవచ్చని నర్సరీ మేనేజర్ శివ రైతులకు సూచిస్తున్నారు. మొక్కజొన్న, వేరుశనగ, పత్తితో ఇతర కూరగాయలను అంతర పంటగా సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ ద్వారా దాదాపు 25 నుంచి 30 ఏళ్ల పాటు ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్ రావు అన్నారు.

ఎన్‌సీసీ జాతీయ తలసైనిక్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థి



పాల్సన్‌రాజ్

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఎన్‌సీసీ జాతీయ తల సైనిక్ క్యాంపును గోదావరిఖని డిగ్రీ కళాశాల విద్యార్థి పాల్సన్ రాజ్ పూర్తి చేసుకున్నాడు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాల్సన్ రాజ్ ఎన్‌సీసీ 9వ బెటాలియన్ కరీంనగర్ క్యాడెట్‌గా ఉన్న పాల్సన్ నిజామాబాద్ గ్రూప్ స్థాయిలో క్యాంపునకు ఎంపికయ్యాడు. క్యాంపులో భాగంగా న్యూఢిల్లీలో 12 రోజులు డీజీఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఫైరింగ్ విభాగంలో క్యాంపు విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. శిక్షణ పూర్తిచేసుకుని ఆదివారం కళాశాలకు వచ్చిన పాల్సన్ రాజ్‌ను ప్రిన్సిపాల్ జైకిషన్ ఓఝా, వైస్ ప్రిన్సిపాల్ సాంబ శివరావు, ఎన్‌సీసీ అధికారి తిరుపతిలు అభినందించారు.

మద్యం మానేయాలని మందలించినందుకు వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపం చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ పూర్‌లో పండుగ పూట ఆదివారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని రాయికోటి రాజయ్య(61) కొంత కాలంగా గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుండేవాడు. ఏడాది కిందట స్వగ్రామానికి చేరుకున్న ఆయన స్థానికంగా దినసరి కూలీ పనులు చేస్తున్నాడు. అనారోగ్యంలో బాధపడుతున్న రాజయ్యను కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చూపించి వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని రాజయ్యను ఈనెల 20న మందలించారు. మనస్థాపం చెందిన ఆయన రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య శోభారాణి, కొడుకు బాబు, ఇద్దరు కూతుళ్లు తిరుమల, రాజేశ్వరిలు ఉన్నారు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ మోతీరాంనాయక్ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం

● పెళ్లయి ఆరు నెలలు ● చందుర్తిలో విషాదం


అరవింద్(ఫైల్)

చందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఆరు నెలలకే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబ కలహాలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లాఅటవీప్రాంతంలో జరగగా, చందుర్తి మండల కేంద్రంలో విషాదం నింపిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి లక్ష్మి-రాజు దంపతుల ఏకైక కుమారుడు అరవింద్(30) వివాహం కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన తుమ్మ స్వరూపరాణి-శ్రీనివాస్ దంపతుల కుమార్తె వినూత్నతో గతమార్చి2న వివాహం జరిగింది. భార్యభర్తలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో హైదరాబాదులోని కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈనెల 19న కుటుంబ కలహాలతో అరవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి వికారాబాద్ అటవీప్రాంతంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు గుర్తించి, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఉంటున్న తల్లిదండ్రులకు పోలీసులు ఈనెల 20న రాత్రి సమాచారం అందించారు. భార్య వినూత్న ప్రస్తుత గర్భవతని పేర్కొన్నారు. పెళ్లయిన ఆరు నెలలకే అరవింద్ ఆత్మహత్యకు పాల్పడడంతో చందుర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మల్లేష్ నాయక్(ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి వెళ్లిన ఓవ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్య మల్లేష్ నాయక్(45) పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ ప్రయత్నంలో పక్షులు బెదిరే కలర్ రిబ్బన్‌కు ఒక వైరును కట్టి 11కేవీ వైర్లకు వేయగా ప్రమాదవశాత్తు రిబ్బన్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్ భార్య భూక్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయదారుడిపై కేసు నమోదు

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేసి అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన భూక్య మోతిలాల్ నాయక్ పొలంలో గుడుంబా తయారు చేస్తూ ఇంటి వద్ద విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం మోతిలాల్ ఇంటిని తనిఖీ చేసి 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారు, విక్రయించిన, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ధర్మారం ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

మెప్మా ఆర్పీలకు తప్పని తిప్పలు


జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చిన మెప్మా రిసోర్స్‌పర్సన్లు

● పీఆర్సీ అమలు కోసం ఎదురుచూపులు

● కనీస గౌరవ వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్

● రాష్ట్రంలో ఆరు వేల మంది మెప్మా రిసోర్స్‌పర్సన్లు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) కనీస గౌరవ వేతనం దక్కక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్పీలకు పీఆర్సీ అమలు కాక పోవడంతో రూ.6 వేల గౌరవ వేతనం మాత్రమే అందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు నిధులు సమకూర్చడం, శిక్షణ ఇవ్వడం వంటి పనులను ఆర్పీలు పూర్తి చేస్తారు. పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తుంటారు. సంఘాల కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో 6 వేల మంది మెప్మా రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 173 మంది మెప్మా ఆర్పీలు పనిచేస్తున్నారు.

నెలకు రూ. 600 నుంచి పనిచేస్తున్న ఆర్పీలు..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు నెలకు 600 పారితోషికం అందించేది. 2018 నుంచి ఆర్పీలకు ప్రభుత్వం నుంచి నెలకు నాలుగు వేల రూపాయల గౌరవ వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రెండు వేల రూపాయలు కలిపి ఆరు వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాన్ని స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషికం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్పీలు వ్యతిరేకిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లుకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. అయినా వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి మెప్మా ఆర్పీలు తరలివచ్చి తమ అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. కనీస గౌరవ వేతనం ఏ నెలకు ఆ నెల అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

30 శాతం పీఆర్సీ అమలుకు డిమాండ్..

జీవో నంబరు 164 ప్రకారం స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనను తొలగించి సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) వీఓఏల మాదిరిగా ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నెలకు రూ.20 వేల గౌరవ వేతనం అందించాలని కోరుతున్నారు. గౌరవ వేతనాన్ని ఏ నెలకు ఆ నెల స్వంత ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరు తున్నారు.

గత ప్రభుత్వం అన్ని రంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి మెప్మా ఆర్పీలను మాత్రం విస్మరించిందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ వీఓఏల మాదిరిగా మెప్మా ఆర్పీలకు పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతున్నారు. పని భారం తగ్గించాలని, హెచ్ఆర్ఏ అమలు చేయాల ని వారు డిమాండ్ చేస్తున్నారు. మెప్మా కార్యకలా పాల్లో బాగంగా వివిధ సర్వేలు నిర్వహిస్తామని ఇప్పటికైనా ప్రభుత్వం మెప్మా ఆర్పీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

పీఆర్సీఅమలు చేయాలి

రమ, జిల్లా మెప్మా రిసోర్స్ పర్సన్ సంఘం అధ్యక్షురాలు, జగిత్యాల



ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్లకు 30 శాతం పీఆర్సీ అమలు చేయాలి. ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అరకొరగా ఇస్తున్న గౌరవ వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొం టున్నాం. మెప్మా ఆర్పీలకు నెలకు రూ.20వేల గౌరవ వేతనం అందించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం

దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, మెప్మా అధికారి, జగిత్యాల



మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యను పరిష్కరించడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం. మెప్మా ఆర్పీల డిమాండ్లను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంటుంది.

రైల్వేస్టేషన్ గదిలో విందు


గదిలో మద్యం బాటిళ్లు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి టికెట్ కౌంటర్ గదిలో రైల్వే కమర్షియల్ అధికారులు విందు చేసుకున్నారు. రాత్రి 10గంటల తర్వాత రైల్వేస్టేషన్‌లో కేకలు, కేరింతలు వినబడడంతో స్టేషన్‌సమీపంలో ఉండే ఓవ్యక్తి విందును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీనిని గమనించిన కొందరు అధికారులు వారించారు. అయినప్పటికీ చిత్రీకరించిన వీడియోను వాట్సప్‌లో వైరల్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఇందులో కమర్షియల్ అధికారులతోపాటు కొందరు టీసీలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈవ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని వంతడుపుల గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా ట్రాక్టర్ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని ముద్దల అజయ్, డ్రైవర్ దాసరి సిద్ధార్థలపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులకు భగవద్గీత పఠనపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ ఇన్‌చార్జి అక్షయ చైతన్య మాట్లాడుతూ గీతతో సత్ప్రవర్తన, జ్ఞాపకశక్తి, దేశభక్తి అలవడుతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో జీవనవిధానం మెరుగుపడుతుందన్నారు. మొత్తం 2వేల మంది విద్యార్థులకు గీతా శ్లోకాలు నేర్పించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, మిషన్ ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, జలంధర్, కొండయ్య, రజనీకాంత్, చంద్రం, వసంతం, అనుదీప్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, తిరుపతి, సుదర్శన్, రాజేశ్వర్ తదితరులు పాల్గొ న్నారు.

● జిల్లా స్థాయి విజేతలు

ప్రతీ గ్రూపులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందించగా బి లో వేదాంశ్, సుధేష్ణ, వినయ్, సిలో కె.అద్వైత్, ఎం. సాన్విక, ఇ.స్నితిక, డిలో మ్యాన శ్రీహిత, బి.మనస్వి, పి.వర్షిత్, ఈ లో శ్రీశాన్వి, కె.తేజస్వి, గాజుల తేజస్వి గెలుపొందారు. వీరికి త్వరలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.


విజేతలైన విద్యార్థులతో అతిథులు

వ్యవసాయబావిలో పడి వృద్ధురాలు మృతి

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన గట్టు నర్సమ్మ(85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లికి చెందిన నర్సమ్మకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 17న తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఉండే కూతురు వద్దకు వెల్లింది. అక్కడి నుంచి 19న ముంజంపల్లికి ఆటోలో వచ్చి సమీపంలోని వ్యవసాయబావిలో పడింది. ఆదివారం వ్యవసాయబావిలో మృతదేహాన్ని గుర్తించిన ఓ రైతు గ్రామస్థులకు తెలియజేయడంతో అక్కడికి వెళ్లి చూడగా నర్సమ్మగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానేరు వాగులో పడి ఒకరి మృతి


రవీందర్‌గౌడ్(ఫైల్)

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరువాగులో ఆదివారం ఇల్లంతకుంట మండలం రాచపల్లికి చెందిన ఆరెల్లి రవీందర్‌గౌడ్(50) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఉదయం మానేరు తీరానికి వచ్చిన రవీందర్ నీటిలో ఈదుకుంటూ వస్తుండగా అంతలోనే ఫిట్స్ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రహదారిపై కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ వద్ద నుంచి వెళుతోంది. గమనించిన వాహనదారులు ఆగి హతమార్చేందుకు యత్నించారు. రాళ్లతో కొట్టడడంతో కొండచిలువ తప్పించుకుని పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లింది.


రోడ్డు పక్కనుంచి వెళుతున్న కొండచిలువ

కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

ఖైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీలంక షిర్కే ప్రాంతానికి చెందిన పెనుగొండ కుమార్ (38) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. గోదావరిఖని టుటౌన్‌సీఐ ప్రసాద్‌రావు మృతదేహాన్ని ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతును కాటేసిన నాగుపాము

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం రైతు సత్తయ్యను నాగుపాము కాటేసింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య రోజులాగే వ్యవసాయక్షేత్రానికి వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా అతన్ని పాము కరిచింది. వెంటనే అతన్ని తోటి రైతులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం సత్తయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని వారు స్పష్టం చేశారు.

నీటి ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● బొమ్మకల్ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో ఘటన


చిన్నారుల మృతదేహాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా ఉన్న ఇద్దరు చిన్నారులు ఇంటి బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడి మృతి చెందారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్‌లో చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. కరీంనగర్ రూరల్‌సీఐ, స్థానికుల వివరాల ప్రకారం... కరీంనగర్ శివారులోని బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్‌పైపుల ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన సహానీ బిట్టుకుమార్, అతడి భార్య సుధాదేవి ఐదేళ్ల నుంచి కూలీలుగా పని చేస్తున్నారు. ఇద్దరు కొడుకులు, కూతురుతో ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బిట్టుకుమార్‌మార్కెట్‌కు వెళ్లాడు. భార్య సుధాదేవి ఇంట్లో పనిచేసుకుంటూ ఉంది. కూతురు కూడా ఇంట్లోనే ఉండగా ఇద్దరు కుమారులు సత్యం కుమార్(4), ఆర్యన్‌కుమార్(2) బయట ఆడుకుంటున్నారు. కొంతసేపటికి తల్లి సుధాదేవి బయటకు వచ్చి చూడగా వారు కనిపించలేదు. దీంతో ఫ్యాక్టరీ అవరణలో చూడగా పైపులు క్యూరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్‌కుమార్ మృతదేహం నీటిపై తేలి కనిపించింది. దీంతో ఫ్యాక్టరీలోని కూలీలకు విషయం తెలుపగా అర్యన్‌కుమార్‌ను బయటకు తీశారు. నీటిలోపల వెతకగా సత్యంకుమార్ మృతదేహం కూడా లభ్యమైంది. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రి మార్చురీ గదిలోభద్రపరిచారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవురోజు కాకపోతే కాపాడేవారేమో..

ఆదివారం సెలవుదినం కాబట్టి ఫ్యాక్టరీలో పనులు బంద్ చేయడంతో ఆవరణలో కూలీలు ఎవరూ లేరు. కొందరు వారివారి గదుల్లో ఉండగా మరికొందరు మార్కెట్, ఇతరపనుల్లో బిజీగా ఉన్నారు. ఇద్దరు చిన్నారులు బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడ్డారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. ఫ్యాక్టరీ పనివేళల్లో ఐతేఎవరైనా సిబ్బంది గమనించి కాపాడేవారంటూ కుటుంబ సభ్యులు రోదించారు. కూతురు(6) తనతమ్ముళ్లతోకలిసి ఆడుకున్నా ఈ విషయం వెంటనే తల్లికి తెలిసేదని, తల్లితో ఇంట్లో ఉందని చెబుతున్నారు. ఐదేళ్లుగా ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామని, ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని కూలీలు వాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో కూలీలు, వారిపిల్లలు నివాసం ఉంటుండడంతో వాటర్ ట్యాంక్‌తో ప్రమాదాలు జరుగకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతాచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటర్ ట్యాంక్ వద్దకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న చోట తగినజాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉండదని, ఇప్పటికైనా ఇటువంటి ప్రమాదకరమైన స్థలాలకు చిన్నారులను దూరంగా ఉంచేలా చర్యలు అధికారులు తీసుకోవాలని ప్రజలు కోతున్నారు.

పోలీసులు కొట్టారని సెల్‌టవర్ ఎక్కి నిరసన

● బాధితుడికి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు


కౌన్సెలింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

హుజూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను కొట్టారని నిరసిస్తూ హుజూరాబాద్‌లో ఆదివారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలుఇలా ఉన్నాయి.. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన శ్రీనివాస్ దళిత బంధు పథకం కింద డిజే సౌండ్స్‌ను కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని డీజేతో ఊరేగింపుగా తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శ్రీనివాస్, పోలీసుల మధ్య మాటమాట పెరగడంతో, డిజే సౌండ్స్‌ను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు తనపై చేయి చేసుకున్నారని మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు సెల్‌టవర్ దిగాలని విజ్ఞప్తి చేశారు. పోలీ సులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ టవర్ దిగాడు. టౌన్ సీఐ కరుణాకర్ శ్రీనివాస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరించారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా డీజేలు పెట్టరాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు షర్ట్, బ్లాకలర్ జీన్స్‌పాయింట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచినట్లు తెలిపారు. గుర్తించి నవారు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన తైక్వాండో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20వ తేదిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో రాణించినట్లు తెలిపారు. తైకాండో క్లబ్ కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 కేటగిరి వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇద్దరు గోల్డ్ మెడల్, ఆరుగురు సిల్వర్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చక్రధర్‌రావు మెడల్స్‌ను అందించి అభినందించారు. విద్యార్థులను తైక్వాండో అసోషియేషన్ సభ్యులు సంతోష్ కుమార్, గంగారావు, నావనంది రమేష్ అభినందించి సన్మానించారు.



దొంగలున్నారు జాగ్రత్త

● ఇంటికి తాళం కనపడిందో...
తెల్లవారేసరికి సొమ్ములు చోరీ

● విలువైన బంగారం, డబ్బులు ఇళ్లలో పెట్టవద్దని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు ఉత్సాహంగా ఉంటుంది. స్వగ్రామాలు, పల్లెటూళ్లకు వెళ్లడం, విహారయాత్రలు లాంటివి ప్లాన్ చేసుకుంటారు. ఇవే సెలవులు దొంగలకు సెలవుగా మారుతున్నాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న చాలా కుటుంబాలు సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దీనిని దొంగలు అవకాశంగా మలుచు కుంటారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి.

పగటిపూట రెక్కీ.. రాత్రి వేళ చోరీ

తాళంవేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు నగదుతోపాటు బంగారం, వెండి, వాహనాలు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ వారు టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటారు. తాళం వేసిన ఇళ్లను గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ పిన్ చేసుకుని అర్ధ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పగటి పూటనే రైతులు ఇళ్లకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళుతున్న సమయంలో అదనుచూసి లూటీ చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..: గౌస్ ఆలం, సీపీ



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళతారు. ఈ సమయంలో చోరీలను నివారించడానికి పోలీస్ శాఖ తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాము. పండుగకు వెళ్లే ప్రజలు దొంగల బారిన పడకుండా ఉండడానిక్నీ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

24 గంటల గస్తీ ఉన్నా..

ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు కేసు, విచారణ చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా, వేలి ముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నప్పటికీ బాధితుల సొమ్ములు పూర్తిగా రికవరీ కావడం లేదు. జన సమర్ధ ప్రాంతాలు, శివారు కాలనీ కానీ.. ఏ మూలలో అయినా ఇంటికి తాళం కనపడితే చాలు.. దొంగలు రెచ్చిపోయి ఇంటిలోని విలువైన బంగారం, నగదును అపహరించుకుపోతున్నారు. ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉండగా గొళ్లాలను చాకచక్యంగా తొలగిస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశాల్లో వేలి ముద్రలు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖానికి మాస్కులు, వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి చోరీలకు పాల్పడుతతున్నారు. ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు...

- ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ బృందాలు ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెడతాయి.
- ఇంటిని గమనిస్తూ ఉండమని ఇరుగుపొరుగు వారికి చెప్పండి. ఇంటికి సంబంధించిన ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే వెంటనే తెలియజేయమని చెప్పండి.
- ఊరెళ్లేటప్పుడు ఇంట్లో డబ్బు, బంగారం ఉంచకుండా వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపరచండి. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లండి.
- ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టవద్దు. ఇది నేరగాళ్లకు ఇల్లు ఖాళీగా ఉందని తెలియజేస్తుంది.
- ఇంటికి తాళం వేసినప్పుడు, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచడం మంచిది. తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలి.
- ఉదయం పూట పూల మొక్కలు, ఇతర వస్తువులు అమ్మేవారి రూపంలో లేదా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలి. అనుమానితుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- పండుగ సందర్భంగా వచ్చే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఐడీలు సృష్టించి మోసాలు చేసే అవకాశం ఉంది.
- అనవసరంగా వచ్చే మెసేజ్‌లలోని బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు. లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాలను నమ్మవద్దు.
- సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంది.
- సైబర్ నేరాల ఫిర్యాదు కోసం 1930 (జాతీయ హెల్ప్‌లైన్), 112, 100
- ఆన్‌లైన్ ఫిర్యాదు www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో చేయాలి.



మాజీ కలెక్టర్ కేఎస్ శర్మ మృతి

● ఉమ్మడి జిల్లాతో విడదీయరాని అనుబంధం



కేఎస్ శర్మ(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాకు కలెక్టర్‌గా సేవలందించిన కేఎస్ శర్మ(కంభం పాటి సుబ్రహ్మణ్య శర్మ) (80) ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. నిజాయితీ, నిబద్ధత గల ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన ఆయనకు ఉమ్మడి జిల్లాతో విడదీయ రాని అనుబంధం ఉంది.. ఆయన మృతితో కవులు, కళాకారులు, నగర వాసులు, ప్రత్యక్షంగా చూసినవారు గతస్మృతులను నెమరు వేసుకున్నారు. ఆయన హయాంలో కరీంనగర్‌లో త్యాగరాజ లలిత కళాపరిషత్, జవహర్ బాలకేంద్రం, టీఎల్ కే ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేశారు. నెహ్రూ యువకేంద్ర బలోపేతానికి కృషిచేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన ఆయన ఫిలింభవన్‌తోపాటు అనేకసంస్థలకు స్థలాలు మంజూరు చేశారు. సోమవారం ఆయన అంత్యక్రియలు జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శర్మ మృతికి పలువురు కవులు, కళాకారులు, సాహితీ కళాసంస్థల బాధ్యులు, నగరవాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సెరికల్చర్‌లో రాజన్న సిరిసిల్లకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లికార్జున

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెరికల్చర్ అభివృద్ధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాజాతీయస్థాయి అవార్డును సాధించింది. జిల్లాలోని రైతులకు సెరికల్చర్‌లో పట్టుపురుగుల సాగుకు సంబంధించిన అవగాహన కల్పించడం, సాగు పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడంలో జిల్లాను ముందు వరుసలో సెరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి జగన్‌రావులు కృషిచేశారు. ఇందుకు సిల్క్‌బోర్డునుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లాసమన్వయకర్తలుగా గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు సాంకేతిక ప్రదర్శనలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పించినందుకు జిల్లాకు అవార్డులు లభించాయి. ఆదివారం బెంగళూరులోని సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ డైరెక్టర్ లత, సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున అవార్డులు అందుకున్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ సభ్యులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని బీడీవర్కర్ యూనియన్ భవనంలో కరీంగనగర్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రతినిధుల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఆంక్షలులేకుండా పెన్షన్‌కింద జీవనభృతి4000 రూపాయలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీపై బీడీపరిశ్రమను మినహాయించే విధంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. వచ్చే జనరల్‌కౌన్సిల్ సమావేశం అక్టోబరు20వ తేదీన నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తామని జిల్లా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు చింతభూమేశ్వర్, కార్యదర్శి సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, భారతి రాష్ట్రకమిటీ సభ్యులు గంగాధర్, అరుణ, శివకుమార్, భూమయ్య పాల్గొన్నారు.

వేములవాడలో ఎంగిలి పూల వైభవం

● రాజన్న ఆలయంలో ఆకట్టుకున్న బతుకమ్మ, దాండియా ఆటలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ... అంటూ మహిళలు, యువతులు ఎంగిలి పూల బతుకమ్మను వేములవాడ పట్టణం, రాజన్న ఆలయంతో పాటు పల్లేల్లో ఎంతో వైభవంగా చేపట్టారు. మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని కూడళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి తెలంగాణ సంప్రదాయ పాటలతో ఆటలాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎంగిలి పూల తొలిరోజు బతుకమ్మ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, మారుపాక, చంద్రగిరి, చింతలఠాణ, చీర్లవంచ గ్రామాల్లో వాడవాడన డీజే సౌండ్లతో బతుకమ్మ పాటలు మారుమోగిపోయాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో క్రమపద్ధతిలో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడగా, యువతులు బతుకమ్మ పాటలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాజన్న ఆలయంలో దాండియా ఆడుతున్న యువతులు, మహిళలు

రాజన్న ఆలయంలో..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని మహిళలు బతుకమ్మలతో రాజన్న ఆలయానికి తరలివచ్చి ఆలయంలో బతుకమ్మలను నిలిపి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. డిజే సౌండ్ మధ్య యువతులు ఆడిన దాండియా ఆటలు, మహిళలు ఆడిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రాజన్న ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తీసుకువెళ్లిన ఫలహారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.



రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ధర్మపురిలో శేషప్ప కళావేదికపై మహా సత్సంగ్



మహా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ధర్మపురి ప్రఖండ ఆధ్వర్యంలో ఎనిమిది సత్సంగాలను కలుపుతూ మహా సత్సంగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్య నగర్ క్షేత్ర సత్సంగ్ ప్రముఖ్ శాలివాహన పండరినాథ్ మాట్లాడుతూ సత్సంగ్ ద్వారా మనసు, వాక్కు శుద్ధి జరుగుతుందని తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం 21, 21, 108 సార్లు పఠనం చేయడం ద్వారా ఒక్కో ఫలితం పొందగలమని తులసీదాసు తెలిపారని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రతి దేవాలయ కేంద్రంగా సత్సంగ్ నిర్వహణకు కృషిచేయాలని ఆయన కోరారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో సత్సంగ్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పురుషోత్తమాచార్యులు, పూర్వపర్తి సమయ కార్యకర్త జయప్రద, సామాజిక సమరసత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, జిల్లాకార్యదర్శి కస్తూరిరాజన్న, ముత్యపు రమేష్, మామిడాల రవీందర్, వెలగందుల బుచ్చన్న, వెలగందుల రవి తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్ర విభాగంలో మంజులకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మంజుల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి తిరుకోవెల మంజులకు పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'సింథసిస్ ఆఫ్ పైరాన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథడాలజీస్' అనే అంశంపై డాక్టర్ జయంతి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మంజుల ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తీ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రమాకాంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.నమ్రత, బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ ఎం.సరసిజకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

● 23 గేట్ల ద్వారా....73,540 క్యూసెక్కులు దిగువకు



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం వరద నీరు తగ్గింది. 23 గేట్లు పైకి ఎత్తి 73,540 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 95,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తిరిగి ప్రారంభమైన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా తిరిగి నీటి ఎత్తిపోతలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు ఆదివారం 6300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500మానేరు, ములవాగు ద్వారా 1800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5500 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం317.89 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : దిగువ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 5909క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 5500 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 200క్యూసెక్కులు మొత్తం 11,609క్యూసెక్కులు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 4500క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 309క్యూసెక్కులు మొత్తం 12,809క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదు

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ఎస్సీఎస్టీమైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలో సాధించిందేమీ లేదని, తననోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేసి ఎంత కష్టమైన మరోరెండు గ్యారెంటీ పథకాలను ఇచ్చి తీరుతామని ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారంవారం లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తున్నామని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ఇందిరమ్మ ఇళ్లు కట్టలేదని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్ ఇంటి ప్రారంభోత్సవానికి పిలిస్తే వస్తారా అని ఆయన ప్రశ్నించారు. చెగ్యాం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు సిద్దిపేటకు తరలించుకపోతుంటే కొప్పులఈశ్వర్ నియో జకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. అధికారం కోల్పోయి అక్కసుతో కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు మానుకోవాలని ఆయన సూచించారు. యూరియా కొరత దేశమంతా ఉందని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు యూరియా కొరత గురించి సంబంధిత మంత్రులను కోరలేదని, కాంగ్రెస్ ఎంపీలు మాత్రమే యూరియా అందించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్‌లో చాలామంది నాయకులు తమతో టచ్‌లో ఉన్నారని తాము గేట్లు తెరిస్తే మీపక్కన ఎవరు కూడా మిగలరని ఆయన తెలిపారు. ధర్మపురి పట్టణంలో త్వరలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీసభ్యుడు, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టిరాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రాప్లానాయక్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ప్రదీప్‌రెడ్డి, జంగిలి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో అనారోగ్యంతో తక్కళ్లపల్లి వాసి మృతి

కథలాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన సంగ మల్లయ్య(59) అనే గల్ఫ్ వలసజీవి అనారో గ్యంతో సౌదీలో రెండురోజుల కిందట మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలి పిన వివరాల ప్రకారం.. మల్లయ్య 25 సంవ త్సరాలుగా సౌదీలో ఓ అరబ్ షేక్ ఇంట్లో తోట మాలిగా పనిచేస్తున్నాడు. అయితే ఈ మధ్య మెడుకు సంబంధించిన సమస్యతో ఇబ్బందులు పడుతుండగా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆ సమస్య తీవ్రం కావడంతో మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కొడుకు దుబాయి నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చూడాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మాజీ సర్పంచ్ అల్లకొండ లింగం గౌడ్ కోరగా ఎంబసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబులెన్స్ వసతి ఉచితంగా కల్పిస్తానని అదేవిధంగా గల్ఫ్ పాలసీలో భాగంగా అందించే ఐదు లక్షల రూపాయలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు లింగంగౌడ్ తెలిపారు.



మల్లయ్య(ఫైల్)

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో...



జయ్యారం, మంథని, సుల్తానాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కళ్యాణ్‌నగర్ /మార్కండేయకాలనీ, సెప్టెంబరు 21: ఒక్కేసి పువ్వేసి చందమామ... ఒక్కజాములాయే చందమామ... శివుడచ్చేవేళయే చందమామ... శివుడు రాకపాయే చందమామ అంటూ పారిశ్రామిక (ప్రాంత వాకిళ్లు పూలతోటయ్యాయి... తంగెడు, గునుగు, చామంతి, సీతమ్మ జెడలు, బంతిపూలు, కలువలు, కమలాలలో సందడి చేస్తూ కొలువుదీరిన గౌరమ్మకు ఆడపడుచులు పాటలతో ఆటలు...చప్పట్లతో బతుకమ్మను కొలిచారు...

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం ఎంగిలిపూల పర్వదినంతో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వాడవాడలా బతుకమ్మల పాటలు, ఆడ పడుచుల చప్పట్లతో మారుమోగాయి. ఆటలతో కనువిందు చేశాయి. పరిసర గ్రామాల నుంచి ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున తంగెడు, గునుగు, సీతజడ, తారమ, బంతి, గుమ్మడి పూల అమ్మకాలు జరిగాయి. ఉదయం నుంచి మహిళలు ఇంట్లో బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. సాయంత్రం ఒక్క చోటకు చేర్చి పాటలు పాడుతూ ఆటలాడారు. కోదండ రామాలయం, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, తిరుమల్‌నగర్, చంద్రశేఖర్‌నగర్, రమేష్‌నగర్, విద్యానగర్, మార్కండేయకాలనీ, జీఎం కాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, సప్తగిరికాలనీ, శారదానగర్, ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లలో బతుకమ్మ ఆటపాటలు వైభవంగా జరిగాయి. రాత్రి 11గంటల వరకు ఆటపాటలు ఆడి బతుకమ్మలను గోదావరి, ఆలయాల వద్ద నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



బొడ్డెమ్మను నిమజ్జనానికి తీసుకెళుతున్న మహిళలు

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రగతి టెక్నో స్కూల్‌లో ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే వివిధ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను మహిళలు కన్నుల పండువగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, టెక్నో స్కూల్ కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్ మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఆలయాలు, గ్రామ కూడళ్లు, గ్రామాల వీధులు, పాఠశాలల మైదానాలు పూల వేడుకలకు నిలయంగా మారనున్నాయి.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మహిళలు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఉదయం నుంచే తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోటకు చేర్చి లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలకరించిన బతుకమ్మలను తీసుకువచ్చి ఆడిపాడారు. కరస్పాం డెంట్ చదువువెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బొడ్డెమ్మకు తొలి పూజలతో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. చిన్న పిల్లలు, పెద్దలు బొడ్డెమ్మను పూజిస్తూ తొమ్మిది రోజులు వేడుకలు చేస్తారు. ఆటలు ఆడుతారు. దీంతో పట్టణాల్లో గ్రామాల్లో బతుకమ్మ సందడి ప్రారంభం అవుతుంది. బొడ్డెమ్మ వేడుకలు తొమ్మిది రోజులు పూర్తి కావడంతో గాంధీనగర్ వాసులు మాజీ కౌన్సిలర్ అనుమాల అరుణ బాపురావు ఆధ్వర్యంలో బొడ్డెమ్మను నిమజ్జనం చేశారు. ఎంగిలి పూల బతుకమ్మకు స్వాగత వేడుకలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు



ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జూలపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్, కీచులాటపల్లి గ్రామాల మధ్య ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.50లక్షల నిధులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు, మంత్రి శ్రీధర్‌బాబుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మార్కెట్‌చైర్మెన్ గండు సంజీవ్, విండో చైర్మన్ వేణుగోపాల్‌రావు, నాయకులు కొత్త రవిందర్, మానుమండ్ల శ్రీనివాస్, కన్నం రాంనారాయణ, జెట్టి సతీష్, కనకట్ల నర్సింగం, వేల్పుల లింగయ్య పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

జూలపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్14, 17 బాలురు, బాలికల తైక్వాండో పోటీల్లో మండలంలోని తెలుకుంటలో కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సాత్విక, జ్యోస్న, మనస్విని, వేదిత,వైష్ణవి, బంగారు పతకాలను అందుకున్నారు. అలాగే పలువురు విద్యార్థులు వెండి పతకాలను అందుకుని, దీంతో జూలపల్లి మండలానికి విద్యార్థులు మంచి కీర్తిని అందించారని కొనియాడుతూ, తైక్వాండో మాస్టర్ నేవూరి సతీష్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీని పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు తల్లి ప్రేమలత మరణించగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హైదరాబాద్ లో ఎమ్మెల్సీ పరామర్శించారు. ప్రేమలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మృతిపై సానుభూతి తెలిపారు. నాయకులు, పాల్గొన్నారు.

జమ్మి మొక్క నాటిన నాయకులు

ఓదెల,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జమ్మి చెట్టు విశిష్టతను కాపాడాలనే సంకల్పంతో ప్రతి గుడి, ఊరుకో జమ్మి మొక్కలు నాటుతున్నట్లు మాజీ జెడ్పిటిసి గంటరాములు తెలిపారు. ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రం వద్ద జమ్మి మొక్క నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా నాటినట్లు తెలిపారు. హరిత సేన రాష్ట్ర కోఆర్డినేటర్ సతీష్, రాజేశ్వరరావు, ఐరెడ్డి వెంకటరెడ్డి, ఆరెల్లి మొండయ్య బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారం... ఆందోళనలో ప్రజలు



కనగర్తిలో రహదారిపై తిరుగుతున్న శునకాల గుంపు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామంలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రులు గుంపులు గుంపులుగా తిరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడంతో సాయంత్రం చిన్నారులు, మహిళలు బతుకమ్మ ఆడుకుంటున్నారు. ఈ సమయంలో కుక్కలు గుంపుగా వెళుతూ చిన్నారుల మీదికి వెళుతున్నాయి. అలాగే చికెన్, మటన్ సెంటర్ల ఎదుట గుంపుగా ఉంటూ వినియోగదారులపై దాడికి పాల్పడుతున్నాయి. కొన్ని శునకాలు చర్మం ఊడిపోయి అగుపిస్తున్నాయి. శునకాలను అరికట్టాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ దీపాలు



కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఐబీ కాలనీలో విద్యుత్ దీపాలు వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఐబీ కాలనీ నుంచి పవర్‌హౌస్‌కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై మున్సిపల్‌శాఖ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఊడిపోయి కిందకు వేలాడుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని, లైట్లు ఊడిపోయి కింద పడే ప్రమాదం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు కార్పొరేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సదానందం



పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లె సదానందంను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్ళుగా పార్టీకి సేవలు అందించడంతో పాటు వివిధ పదవుల్లో పార్టీ అధిష్టానం ఇచ్చిన కార్యక్రమాలను అమలు చేశారని, నరేంద్ర మోదీ తీసుకున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో ముఖ్య పాత్ర పోషించడం వల్లనే పదవి ఇచ్చినట్లు ఆయన వివరించారు. నియామకానికి సహకరించిన జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల రామకృష్ణారెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ సేవా పక్వాడ అభియాన్



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్యకర్తలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో సేవ పక్వాడ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వకర్మ ఆలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దేశంలో పరిశుభ్రత, స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేలా స్వచ్ఛ భారత్‌ను రూపొందించినట్టు తెలిపారు. పేదలకు మరుగుదొడ్లు నిర్మించామని తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ కొండపర్తి సంజీవ్, మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్, నాయకులు మూకిరి రాజు, మారెపల్లి శ్రీనివాస్, ఆకుల కుమార్, అనిల్‌కుమార్, లింగంనాయక్, గంధం శంకర్, అఖిల్‌గౌడ్, ధనుష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం



కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, జూలపల్లిలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం ఆవరణలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహాత్మా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దాసరి ఉష మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ సేవలు మరువలేనివన్నారు. వారి ఆశయ సాధ నతో పద్మశాలి సంఘం అభివృద్ధికి ఐక్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, మండల ప్రధాన కార్యదర్శి బైరి రాజీ వీరు, నాయకులు ఆడేపు రాజు, గోలి సుధాకర్, బైరి కుమారస్వామి, గోలి రమణయ్య, సంపత్ కుమార్, సబ్బని శంకర్, ఒడ్నాల శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, గోలి కేశవులు, గుడ్ల శ్రీనివాస్, రాజమౌళి, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): శాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుకు చేసుకున్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, పెంచిల్‌పేట మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ కొట్టే భూమయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, పాల్గొన్నారు.



ధర్మారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆచార్య కొండాలక్ష్మన్‌బాపూజి వర్ధంతి బహుజన నాయకులు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మన్‌బాపూజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ పాటకుల అనిల్, ఏదుల్ల కనుకయ్య, కోడూరి మహేష్, నగునూరి నారాయణ, తిరుపతి, కొండ రవిందర్, అందె మల్లేశం, వెంగళ వెంకటేశం పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): దొంగతుర్తి పద్మశాలి సంఘ నాయకుల ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ వర్ధం తి నిర్వహించారు. స్వాతంత్ర పోరాటంతో పాటు నిజాం నిరంకుశ పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటం చేసి ఉద్యమాల ఊపిరిగా కొండా లక్ష్మణ్ బాపూజీ నిలిచారని పద్మశాలి సంఘ నాయకులు ఎన్నం రమేష్ అన్నారు. శాసన సభ్యుడిగా, మంత్రిగా పనిచేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.

ఖని మార్చురీ గదికి మరమ్మతు



రంగులు వేసి ఉన్న మార్చురీ గది, అవయవ, దేహదానంపై వాల్ రైటింగ్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచే మార్చురి గదికి, మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక నిధులు కేటాయించారు. మార్చురీ గది లోపల, బయట టైల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రహరీ చుట్టూ అవయవదానం, దేహదానం, నేత్రదానాలపై ప్రచారాల వాల్ రైటింగ్ చేయించారు. గతంలో మార్చురీ గది వద్దకు వెళ్లాలంటేనే చాలా మంది ఇబ్బంది పడే వారు. ఇటీవల ఆసుపత్రిలో నూతనంగా ఓపీ విభాగంలోని ప్రత్యేక కౌంటర్లతోపాటు మార్చురీ గదికి మరమ్మతులను చేపట్టి అన్ని హంగులను ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం అనంతరం శుభ్రపరిచేందుకు నిరంతరం వాటర్ సప్లైని కూడా ఏర్పాటు చేయించారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో ధూళికట్ట విద్యార్థుల ప్రతిభ



నాగ చైతన్యకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 19, 20 తేదీల్లో సుల్తానాబాద్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ధూళికట్ట హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతి విద్యార్థి జల్లి నాగచైతన్య అండర్-14లో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు, 8వ తరగతి విద్యార్థి సిద్దార్థ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. వీరి ప్రతిభకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను, విద్యార్థులను హెచ్‌ఎం బిజిలి సదయ్య అభినందించారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న సదయ్య

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలోని ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్లలో చేసి చూపించారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజనవేన సదయ్య అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్యాల, పోచంపల్లి మధ్య ఉన్న నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు ఎమ్మెల్యే రూ.76 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు సుముఖంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో తూకంలో తరుగు, వడ్ల కటింగ్, రైసు మిల్లుల వద్ద దోపిడీతో రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే విజయరమణరావు వంద కోట్లకు పైగా నిధులు మండలానికి తీసుకొచ్చారని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ సర్పంచులు పొన్నమనేని దేవేందర్‌రావు, మాదాసు సతీష్, రవి, శివరామకృష్ణ, ద్యాగేటి రామచంద్రం, కాసర్ల విద్యాసాగర్ రెడ్డి, రమేష్, కాసర్ల మల్లారెడ్డి, నంది సంజీవరెడ్డి, నగేష్, రాజిరెడ్డి, శ్రీకాంత్, దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడికి సన్మానం

గాకమాన్‌పూర్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గం అధ్యక్షుడిగా నియామకమైన తోట రాజ్‌కుమార్‌ను ఆదివారం శాలపల్లి గ్రామంలో సన్మానించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, పెంచికల్‌పేట మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, మాజీ వైస్‌ఎంపీపీ కొట్టే భూమయ్య, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, మాజీ ఉపసర్పంచ్ సాయికుమార్, నాయకులు కొలిపాక శంకర్, పల్లె నారాయణ, మాటేటి కుమార్, రామ్మూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూరియా పంపిణీ

ఎలిగేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట, ఎలిగేడు, లోకపేట గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ అధికారుల ఆధ్వర్యంలో యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమాపతి మాట్లాడుతూ రైతులకు యూరియాను అవసరం మేరకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. నిల్వ చేసుకుంటే యూరియా పని చేసే సామర్థ్యం తగ్గుతుందని, మిగతా రైతులను దృష్టిలో పెట్టుకొని సహకరించాలని అన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా గ్రామాలకు సరిపడేలా అందజేసినట్లు వివరించారు. ఎలిగేడులో 350, ముప్పిరితోటలో 340, లోకపేటలో వంద బస్తాల యూరియాను అందజేశామన్నారు. సీఈవోలు విక్రం, గడ్డం రవీందర్ రెడ్డి, ఏఈఓలు గణేష్, సురేష్, శరణ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం మాజీ ఎంపీటీసీ బోడుకుంట శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇందులో ఆర్థోపెడిక్ డాక్టర్ చొక్కారపు రాము ఆధ్వర్యంలో కీళ్లు, నడుము, మెడ, నొప్పులు ఉన్న వారితో పాటు కీళ్లవాతం, పోలియో వంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 300 మంది గ్రామస్తులకు మాత్రలను అందజేశారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరైన వైద్య నిపుణుడు రామును శంకర్, రాజేశం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోడుకుంట శంకర్, గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేష్, కరీంనగర్ సురక్ష హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు కోలల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామంలోని పలు కాలనీల్లో మహిళలకు కాంగ్రెస్ నాయకులు బాలే శివ ప్రసాద్ ఆదివారం కోలలు అందజేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందించినట్లు తెలిపారు. నాయకులు, గ్రామస్థులు ముస్కే రవి, మేడి అశోక్ గౌడ్, ముస్కు మధుకర్, అనుముల చంద్రయ్య, గుడ్ల శ్రీనివాస్, అనుముల రాజిరెడ్డి, బక్కుల రామన్న, చీర ఓదెలు, రానవేన రామస్వామి, కూస సతీష్, రహీంఖాన్, నోముల కిరణ్, ముస్కు సంపత్ రెడ్డి, జాల్ల రాజ్ కుమార్, నోముల శ్రీనివాస్, జంగిలి రాజేష్, పాల్గొన్నారు.

నీడ స్వచ్ఛంద సంస్థ చేయూత

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గంగానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సతీష్ కుటుంబానికి నీడ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్ళ క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో సతీష్ తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని ఆదివారం సతీష్ కుటుంబానికి రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పల్లె రమేష్‌గౌడ్, నాగభూషణంగౌడ్, రావుల శ్రీనివాస్, నజీర్ పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు బియ్యం పంపిణీ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దెల్లి తేజస్విని జన్మదినం సందర్భంగా ఆదివారం డయాలసిస్ రోగులకు మాజీ కార్పొరేటర్ పెద్దెల్లి ప్రకాష్ బియ్యం పంపిణీ చేశారు. డయాలసిస్‌తో బాధపడుతున్న దస్తగిరి, శంకర్ కుటుంబాలకు బియ్యాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ పనిచేయలేని స్థితిలో ఉన్న వారికి తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, శేఖర్, నగేష్ పాల్గొన్నారు.